# పరివర్తనం

రచయిత్రి:
ఏ. సరస్వతీబాయి

★

ఆ నాడు ఉదయం అందిన ఉత్తరాన్ని చూచినప్పటినుండి మాలతి హృదయం ఒక్క స్థితిలో లేకుండా అలమటిస్తూ ఉంది. తన శక్తి కొద్ది హృదయాన్ని సమాధాన పరచాలని ప్రయత్నించింది. ఆమె హృదయం శాంతించలేదు. ఏడెనిమిది సంవత్సరాలుగా ఆమె తన హృదయాన్ని రాయిగావించుకొంది. కాని యీ దినం అందిన తన తమ్ముడు గిరిధర్ ఉత్తరం ఆ శిలా హృదయాన్ని గూడా కరిగింపజేసేసింది.

బిడ్డలిద్దరూ స్కూలుకు వెళ్లారు. భర్త సూర్యం ఆఫీసు కెళ్ళిపొయ్యాడు. పనిమనుష్యులు తమతమ పనులన్ని నెరవేర్చి ఊరుచుట్టి రావటానికి వెళ్లారు. ఇంటిని నిశ్శబ్దత ఆవరించింది.

మాలతి చేతిలోని గిరిధర్ ఉత్తరాన్ని త్రిప్పి చదువసాగింది. నాలుగు గీతలు మాత్రమే.

ప్రియమైన అక్కయ్యా!

నాన్నగారి ఆరోగ్యం మిక్కిలి ఆందోళనగా ఉంది. నిన్నొకసారి చూడాలని కలవరిస్తున్నారు. వెంటనే వస్తావని ఎదురుచూచు...

నీ ప్రియ
గిరిధర్.

మాలతి కళ్లనుండి నీరు ప్రవాహమైంది. ఉత్తరాన్ని మడచి ఓ పుస్తకంలో పెట్టింది. ఆమె హృదయం భరింపరాని బాధ పడుతోంది. లోపలికెళ్ళి చన్నీళ్లు త్రాగింది.

నాన్నకు ఆరోగ్యం ఎల్లా ఉందో? ఎవరు గమనిస్తున్నారో? ఇద్దరు ముగ్గురు పిల్లలు గల ఒదిన ఏం చూడగలుగుతుంది పాపం! అన్నయ్య ఆఫీసు పనే చూస్తాడా? ఇంటిలో నాన్నగార్నే చూస్తాడా? గిరిధర్ చిన్నవాడు. ఆ రోజుల్లో నాన్నగారు నాకోసం ఎన్నికష్టాలు అనుభవించారు. ఆయనకు నా వల్ల ఏ సుఖమూ లేకపోగా అంత్యదశలో ఆయనదగ్గర లేకపోతున్నాను. సూర్యంతో వెళుతానంటే "కావలసిన డబ్బు పంపు. నీవుమాత్రం అక్కడికి వెళ్లవద్దు" అంటారు. డబ్బు ఒకటేనా మానవుడికి ప్రధానం. ఆయనకన్న బిడ్డను కానా? తనబిడ్డను చూడాలని ఏ తండ్రికి ఉండదు? ఆలోచనలతో ఆమె హృదయం ఆరాటపడుతోంది. కళ్లలో నీరుకారుతూనే ఉంది.

పాశ్చాత్య పద్ధతిలో కట్టబడిన బంగళా తనది. రకరకాల పూలచెట్లతో మనోహరంగా ఉన్నతోట; చెప్పిన పనిచేసే నౌకరులు; రత్నాలవంటి బిడ్డలు ఇద్దరు. తన కంటిరెప్పలా ఉండే భర్త. తృప్తికోసం కావలసిన నగలు... చీరలు వున్నాయి... కాని దశాబ్దంగా తన హృదయంలో ఏమిటి ఈ వేదన? అందనివస్తువేదో కావాలంటుంది. ఆమె మనస్సు అది ఏది? ఆమెకే అర్థం కాలేదు.

వసారాలో ఎంతసేపు వుందో ఆమెకే తెలియదు. తన కళ్ళనుండి దిగజారి పోతూన్న అశ్రుబిందువులు ఆమె కట్టిన చీరను తడుపుతున్నాయి. ఆమె దానిని గమనించనే లేదు.

♦ ♦ ♦

ఆ నదికి ఇరవైగజాల దూరంలో ఒక చిన్న పూరి గుడిసె. చుట్టు ముళ్లకంపలతో మూయబడిన కొంత కాళీజాగా గుడిసె చాల పాతది. ఎదుట పాడుబడిన గర్భగుడి. శివాలయం తప్పితే దగ్గర్లో యిళ్లుగాని మరేమిగాని లేవు. ఆ యింటి వెలుపల ఇద్దరు బిడ్డలు ఆడుకొంటున్నారు. ప్రక్కలో ఖిన్నుడై కూర్చున్నాడు ఒక యువకుడు. తలుపు తెరచుకొని ఓ యువతి బయటికి వచ్చింది. చంకలో చంటిపిల్లాడు. "ఈ రోజు ఉత్తరం రాలేదుకదా! ఓ టెలిగ్రాం అయినా యివ్వండి" అంది యువతి.

"సరళా!—నీ కోసం నాన్నగారికోసం నా మర్యాదల్ని కూడా పూర్తిగా పోగొట్టుకున్నాను. ఎన్ని ఉత్తరాలు వ్రాసాను?—ఆ కిరాతకుడు ఒక్కదానికైనా

జవాబు వ్రాసాడా? మాలతి ప్రాణంతో ఉందో లేదో ఎవరికి తెలుసు? నీవు నాన్న పట్టుపట్టకపోతే ఆ ధన మదాంధుడైన వానికి మాలతిని ఇవ్వటం జరిగి ఉండేదా? ఇంతకూ ఒకర్ని అనవలసిన పనిలేదు."

అతని మాటలు వింటూ మౌనంగా నిల్చుంది అతని భార్య.

"గడచినవి విస్మరించి ఆఖరుసారిగా ఓ టెలిగ్రాం ఇవ్వండి. నాన్నగారికి కొంత మనశ్శాంతి అయినా కలుగుతుంది" అంటూ చంటివాణ్ణి దిగవిడచి లోనికి వెళ్లింది ఆమె.

గది మూలలో ఓ నులకమంచం. దానిమీద అటూ ఇటూ పొరలుతున్న ముసలిప్రాణి...క్రింద రెండుమూడు మందుసీసాలు. ఆ ముసలి జీవి అప్పుడప్పుడూ కలవరిస్తూ వుంది. "మాలతీ! మాలతి వచ్చిందా?" అంటూ బలహీనంగా కలవరిస్తున్నాడు. మాలతి వచ్చిందేమోనని కళ్లు తెరవడానికి ప్రయత్నించాడు, ముసలిప్రాణి......

"మాలతీ వచ్చేస్తుందండీ. మీరు కాస్త జావత్రాగండి" అని అడిగింది సరళ.

"జావ...మాలతీ...వచ్చాక త్రాగుతా" అసంతృప్తితో మూలుగుతూ చెప్పాడు.

"జగదీశ! యిది ఏమిటి కష్టం"—అంటూ నిట్టూరుస్తూ వెళ్లింది సరళ. బడినుండి వస్తున్న గిరిధర్—

"ఒదినా అక్కయ్య వచ్చిందా?" అన్నాడు. సరళ గిరిధర్‌ని ప్రేమతో నిమురుతూ "లేదు బాబూ, రాలేదు. మీ అన్నయ్య టెలిగ్రాం కూడా ఇప్పుడే ఇచ్చివచ్చారు."

"బావ అక్కయ్యను ఎన్నటికీ పంపడు ఒదినా" అతని కళ్లలో నీరు గిర్రున తిరిగినయ్. లోపలికెళ్ళిపొయ్యాడు.

◆ ◆ ◆

మధ్యాహ్నం మూడుగంటలయింది. సూర్యం వాలు కుర్చీలో కూర్చొని ఉన్నాడు. కుర్చీప్రక్కలో చిన్నబల్ల మీద కొన్ని ఫలహారాలు...అందమైన పింగాణి పాత్రలలో అమర్చబడి ఉన్నాయి. కాఫీ గ్లాసుతో వచ్చింది మాలతి. ఆమె కళ్ళు ఎఱ్ఱబారి ఉన్నాయి. ఒక్కనిమిషం నిశబ్దంలో గడచింది..."ఫలహారాలేమి తినవే లేదే?" అంటూ ఫలహారాల తట్ట ముందుకు జరిపింది.

"నీవు భోంచేయలేదా మాలతీ...పిల్లల కిచ్చావా? ఈ పళ్లని నీ కోసం తెప్పించాను కదూ..." అని ప్రీతి తోచి ఆమె నోటిలో వేయబోయాడు. అప్పుడు ఆమె ముఖం ఎఱ్ఱబారి ఉండటం గమనించాడు.

"మాలతీ! ఎందుకలా ఉన్నావ్? ఒంట్లో బాగా లేదా? కళ్లంతా ఎఱ్ఱబారిన వేమిటి...?

అతని కంఠంలో సంతాపం తొణికిసలాడుతోంది.

"ఒంట్లో కులాసాగానే ఉంది" అంటూనే కాఫీగ్లాసు బల్లమీద ఉంచింది.

"ఏమిటీ అలా వుంది నీ ముఖం? నాతో చెప్పవూ?" అని మరీ మరీ బ్రతిమాలాడు.

"నాన్నగారికి చాల అపాయకరమైన జబ్బు చేసిందట. వెంటనే నన్ను రమ్మని తమ్ముడు ఉత్తరం వ్రాసాడు. నేను..." మాట పూర్తి చేయలేక పోయింది.

తృళ్లిపడ్డాడు సూర్యం. అతనికేమీ తోచలేదు. పెళ్లి అయినతరువాత ఒకనాడైనా మాలతి అతని ఎదుట ఇట్లా కోరనేలేదు.

"మాలతీ...ఇదిగో! ఇటు చూడు" అంటూ ఆమె చేతులను మృదువుగా విడదీసాడు.

మాలతి తన కళ్లలో కారుతున్న కన్నీటిని కూడా లెక్క చెయ్యకుండా...

"నాన్నగారిని చూడాలని వుంది."

ఆమె కంఠస్వరం గంభీరంగా ఉండటం గమనించాడు సూర్యం. అతని ఆశ్చర్యమునకు అంతేలేదు. అల్లాగే చూస్తూ కూర్చుండి పొయ్యాడు.

"మాలతీ! నీ కేమైనా పిచ్చా?"

"మృత్యుదేవత ఒళ్లో ఉంటూ వ్రేళ్ళమీద నిముషాల్ని లెక్కపెట్టుకుంటున్న నాన్నగారిని చూచిరావటం పిచ్చా? నా కట్లా తోచటం లేదు" ఆమె శాంతంగానే అంది.

"మాలతీ నీవేమి మాట్లాడుతున్నావో ఆలోచించావా? ఒక పెద్ద ఆఫీసరు భార్యవైన నీవు యిటువంటి స్వల్ప కోర్కెలను ఆశింపవచ్చునా? ఆ పల్లెటూరి పూరిగుడిసెకు నిన్ను పంపడానికి నేను సమ్మతించను. మీ నాన్నగారికి డబ్బు పంపు. నీవు వెళ్లడానికి వీలులేదు" అంటూ పేపరు మీద దృష్టి పోనిచ్చాడు సూర్యం.

ఆమె అతని మొహంలోకి తీక్షణంగా చూచింది. అప్పుడు ఆమె మొహంలో అతనిపట్ల వున్న భయమంతా ఎక్కడో మాయమైంది.

"మీ డబ్బు...మీరున్నూ బాగానే ఉంది. మా నాన్న అన్నయ్యా ఎంత బీదవాళ్ళయినప్పటికీ...మీ దగ్గరకు యాచనకు రాలేదు. మా అన్నయ్యా నన్ను ఎంతో ప్రేమగా చూచేవాడు. మన పెళ్ళి అయ్యాక నన్ను పంపటం పూర్తిగా మాన్పించారు గదా! అంటే వాళ్ళని రాకుండా చేసారు. నాన్నగారిని చూడకుండా ఉండలేను. నేను వెళ్ళి తీరాలి" నిశ్చలంగానే అంది మాలతి.

"మాలతీ ఏమిటా అధికప్రసంగాలు? ఇట్లా మాట్లాడమని మీ అన్నయ్య వ్రాసాడా?"

"అన్నయ్యను ఏమీ అనబోకండి. తమ్ముడు గిరిధర్ వ్రాసాడు ఉత్తరం." ఉత్తరం మేజామీద పడేసింది. సూర్యం కన్నెత్తి అయినా చూడకుండా వెళ్లిపొయ్యాడు.

ఐదునిముషాల తరువాత అతని అందమైన కారు గేటు దాటి పరుగెత్తింది.

కిటికీలోనుండి చూస్తూన్న మాలతి కారులో అతణ్ణి చూసి ఓ వేడి నిట్టూర్పు వదలింది. తరువాత ఆమె ఏదో తీర్మానానికి వచ్చినట్లు తటాలున వెనుతిరిగింది. ముప్ఫయి నిముషాల్లో ఓ చిన్న హ్యాండ్ బ్యాగ్‌తో బయటికివచ్చింది.

"రామూ!"

"అమ్మా!"

"నేను తొందరగా ఊరికి వెడుతున్నాను. మీ చెల్లితో పిల్లల్ని జాగ్రత్తగా చూడమని చెప్పు. మూడురోజుల్లో వస్తాను."

"బాబుగారికి ఏమి చెప్పమంటారా?"

"ఏమి చెప్పనక్కరలేదు. అడిగితే ఊరికి వెళ్లానని చెప్పు."

మాలతి స్టేషను వైపు చరచరా నడచిపోయింది.

"నాన్నా! ఏమి కావాలి?" ముసలివాడు మాట్లాడలేదు. ముసలివానికి స్మరణే లేదు. మంచి నిశిరాత్రి, ఎల్లాగో ఆ భయంకర కాళరాత్రి గడుస్తూనే ఉంది. వేకువజామున ముసలివాడు కలవరించాడు.

"మాలతీ!......నా మాలతి వచ్చిందా శ్రీధర్?" గొంతు మూసుకపోయింది.

"ఇక అరగంటలో ఒస్తుంది నాన్నగారూ!"

"లేదు, మాలతిని పిలు...పిలు...అదిగో వస్తూంది. పిలు...లేకుంటే నన్నయినా తీసి కొళ్లు...అబ్బా బాధ, మాలతిని పిలు...ముసలివాని కళ్లకు మృత్యుపొరలు కప్పుకున్నాయి. మాటలు యిక లేవు.

"నాన్నా!" శ్రీధర్ అదరుపాటుతో అన్నాడు. గిరిధర్ తండ్రి మృత కళేబరము మీదబడి వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. సరళ దిగ్భ్రమ జెంది కూర్చుండిపోయింది.

కలకలమని ఉదయం అవుతూ ఉంది. దడమని తలుపు శబ్దం. శ్రీధర్ వెళ్ళి తలుపు తెరచాడు. "అన్నయ్యా! అన్నయ్యా! నాన్న కెలావుంది?" అంటూ లోపలికెళ్ళింది మాలతి. మంచముమీద బడియున్న మృతకళేబరాన్ని చూచి కొంత తడవు ఆమె కొయ్యబారిపోయింది.

మరుక్షణం నాన్నా...నాన్నా అంటూ ఏడ్వసాగింది. శ్రీధర్ ఆమె చేతులను పట్టుకొని కన్నీరు పెట్టుకున్నాడు. గిరిధర్ సరళ వెక్కి వెక్కి ఏడుస్తున్నారు.

◆ ◆ ◆

మూడవరోజు రాత్రి 9 గంటలకు సూర్యం భోజనం చేసి కూర్చున్నాడు; తమలపాకుల తట్టతో దగ్గరకొచ్చి నిలచింది మాలతి. హృదయంలో గలిగిన మార్పును మొహంలో కనబరచకుండా తమలపాకులు తీసివేసుకున్నాడు సూర్యం. పడుకోవడానికి ముందు......

"మీ నాన్నగారి కెలా ఉంది?" అన్నాడు.

"నాన్నగారు చనిపొయ్యారు. మూడురోజులైంది."

ఆమెలో చైతన్యం లేనట్లై శిలయాడు సూర్యం. క్షణం నిశ్శబ్దంలో గడచింది.

ఆతృతతో ఆమె ముఖంలోకి దీక్షగా చూచాడు. ఆ ముఖంలో...అప్పుడు తోచిన సుహృద్భావం అతనికి ఆశ్చర్యాన్ని కలుగజేసింది. ఏమీ మాట్లాడకుండా పక్కమీద మేనువాల్చాడు.

పిల్లల్నిద్దర్నీ పడుకోపెట్టి...కిటికీ అవతల శశాంకుడు మబ్బుల చాటునుండి రావటం తిలకించింది. చంద్రకళ సూర్యం మీద నాట్యం చేస్తోంది. ఆ వెలుగులో సూర్యాన్ని మాలతి కళ్ళు శాంతంగా వీక్షించినై. తీవ్ర తుఫాను తరువాత ఏర్పడే ప్రశాంతత ఆమె ముఖంలో తొణికిసలాడుతోంది.

అదే ఆమెలో కలిగిన నూతన పరివర్తనం.